ప్రజాభవన్ నుంచే పరిపాలన

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- క్యాంపు కార్యాలయానికి ప్రజాభవన్‌గా నామకరణం


ఇబ్రహీంపట్నంలో ప్రజాభవన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇకనుంచి ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రజాభవన్‌గా పిలవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇకనుంచి దీనిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బదులు ప్రజాభవన్‌గా నామకరణం చేశామని తెలిపారు. ఇక్కడి నుంచే పాలన చేపడతామని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఇబ్రహీంపట్నం రావడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా నేరుగా వచ్చి కలవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, నాయకులు.. గోవర్ధన్‌రెడ్డి, గౌస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లికి చెందిన పలు పార్టీలకు చెందిన 25 మంది కార్యకర్తలు సోమవారం ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీకి దక్కేలా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మాడ్గులలో ధాన్యం కొనుగోలు కేంద్రం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీలత

మాడ్గుల: ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ శ్రీలత మాట్లాడుతూ.. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరస్వతి, ఏఓ గౌతమ్, ఏఈఓ రాజేష్, ఏపీఎం నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

మహేందర్‌గౌడ్‌కు ఘన నివాళి


మహేందర్‌గౌడ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మంచాల: మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో సోమవారం బీజేపీ దివంగత నేత మునికుంట్ల మహేందర్‌గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. గ్రామ చౌరస్తాలో మహేందర్ గౌడ్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టిన మహేందర్‌గౌడ్ ఈ ప్రాంతంలో బీజేపీ బలోపేతం కోసం ఎంతో కృషిచేశారని తెలిపారు. బీజేపీ కార్యకర్త నుంచి మండల అధ్యక్షుడిగా ఎదిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప్, అశోక్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య, మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, నాయకులు రమణారెడ్డి, నర్సింహారెడ్డి, ప్రకాశ్, భిక్షపతి, శేఖర్‌రెడ్డి, వెంకటేష్, రాజు, రాజేందర్‌రెడ్డి, మహిళ నాయకురాలు జయశ్రీ,, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన ఎంపీటీసీ గౌరిరెడ్డి సునీత భర్త సుదర్శన్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భగ్వాన్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, అంబాజీ, శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్, నాయకులు.. వెంకట్రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

58 మందికి కంటి పరీక్షలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 58 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 31 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య, లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచండి

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల గిరిజన విద్యాలయ (కేజీబీవీ) పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకర్గ కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ముందు రోడ్డు ఎత్తు పెరుగడంతో పాఠశాల కిందికి పోవడంతో ప్రహరీ ఎత్తు తగ్గిందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్పందించి అవసరమైన నిధులు మంజూర్ చేయించి ప్రహరీ ఎత్తు పెంచాలని ఆయన కోరారు.

ఓటరు అవగాహన ర్యాలీ

బడంగ్‌పేట్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ కార్పొరేషన్ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని మహిళా డ్వాక్రా సాధికారిక భవనం ఆవరణ నుంచి అల్మాస్‌గూడ చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఏఓ మెప్మ జ్ఞానేశ్వర్, మేనేజర్ నగేశ్, టీఎంసీ ఆర్ శంకర్, మెప్మ ఆర్పీలు పాల్గొన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు

ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి


అంబలి అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు

కడ్తాల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని సోమవారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి ప్రజలకు రాగి అంబలిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో గత 50 రోజులుగా మండల కేంద్రంలో రాగి అంబలి కేంద్రాన్ని నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. లయన్స్ క్లబ్‌తో పాటు, స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, జహంగీర్ అలీ, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థినికి పట్టా అందజేస్తున్న ఉపాధ్యాయులు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పరమేష్, ఉపాధ్యాయురాలు బబ్లీ.. విద్యార్థులకు పట్టాలు అందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ట్యాబ్‌లకు జియోసిమ్‌ల అందజేత


సిమ్‌కార్డులు అందజేస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యావిధానంలో పారదర్శకత కోసం పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేసిన విషయం తెలిసిందే. ట్యాబ్‌లకు సంబంధించి ఇబ్రహీంపట్నం విద్యావనరుల కార్యాలయంలో సోమవారం నుంచి జియో సిమ్ కార్డులు అందుబాటులో పెట్టారు. ట్యాబ్‌లు తీసుకున్న వారు సిమ్‌లు తీసుకోవాలని తెలిపారు. ఆయా ట్యాబుల్లో ప్రభుత్వం నుంచి ప్రతీనెల 30జీబీ డేటా వరకు ఉచితంగా అందుతుందన్నారు. రెండు సంవత్సరాల వరకు పోస్టుపెయిడ్ రూపకంగా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మొదటగా ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వరకాల పరమేష్‌కి సిమ్‌కార్డులు అందజేశారు. ప్రతీ ఒక్కరు సిమ్‌కార్డు తీసుకొని ఇన్‌సెర్ట్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రఘు, అశోక్, అమీనా, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు శేషగిరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌జీఎస్ పనుల సామాజిక తనిఖీ

తలకొండపల్లి: మండల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకము పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహింబడుతుందని ఎంపీడీఓ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఉపాధిహామీ సిబ్బంది, మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు మద్యం షాపులు బంద్

ఆమనగల్లు: ఆమగనల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా మద్యం షాపులు మూసి ఉంచాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం 6 గంటల వరకు(మొత్తం 24 గంటలు) అన్ని మద్యం షాపులు, బార్‌లు మూసి ఉంచాలని ఆయన కోరారు.

రేపు ఆర్‌ఎస్‌పీ రోడ్ షో

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలో బుధవారం బీఆర్‌ఎస్ రోడ్‌షో కార్యక్రమం ఉంటుందని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు చుక్కాపూర్‌లో రోడ్‌షో ప్రారంభమవుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


వేడుకను తిలకిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామాలయంలో గల శ్రీగణపతి, సరస్వతి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ నిర్మాణ దాత బస్వరాజ్ రాజమణి దంపతుల ఆధ్వర్యంలో 'శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పట్టువస్త్రాలు, తలంబ్రాలను గ్రామంలో ఊరేగింపుగా ఆలయంలోని కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకువచ్చారు. సీతారాములను పట్టు వస్త్రాలతో అందంగా ముస్తాబు చేశారు. అనంతరం అర్చకులు జ్ఞానేశ్వర్, హరీశ్‌శాస్త్రీ, రామశర్మ, భువనేశ్వర్, శ్రీధర్ బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు రాఘవేందర్, రాంచందర్‌నాయక్, మోహన్‌రెడ్డి, విద్యాసాగర్, సాయిరెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కరుణాకర్, కృష్ణ, అంజయ్య, సంతోష్, మల్లేశ్, దిలీప్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు..

ఆమనగల్లు: మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామ పరిధిలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శెట్టిపల్లిలో ఇటీవల శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం నిర్మించారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు 3రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగనున్నాయి. గణపతి పూజ, అంకురార్పణ, వాస్తుపూజ నిర్వహించారు. 24న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రముఖ ప్రకృతి వైద్యులు రామచంద్ర, పద్మ


మొక్క నాటుతున్న రామచంద్ర, పద్మ

హయత్‌నగర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ ప్రకృతి వైద్యులు రామచంద్ర, పద్మ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని గాంధేయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యం కారణంగా భూమి తన సహజత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఎర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి సహజత్వాన్ని కాపాడటం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఇందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వారు కోరారు. ఈ సందర్భంగా గాం. దీగ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ధరిత్రిని కాపాడుతాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఏఓ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు.. సురేందర్, చైతన్యరెడ్డి, శివారెడ్డి, సుభాష్‌చంద్ర, రఘురాం, సాయి, నీరజ్, జానత్‌ఉన్నీసా, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి

కాంగ్రెస్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి


ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మంచాల: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మాజీ మంత్రి, దివంగత నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం అరుట్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, చంద్రయ్య, బుగ్గరాములు, వాజీద్, హన్మంత్‌రెడ్డి, జంగయ్య, రమేష్, కృష్ణ, ఐలయ్య, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభ ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న నిర్వాహకులు, గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు. దాదాపుగా 1,500 సంవత్సరాలకు చెందిన ఆలయం చాలా ఏళ్లుగా మూతపడి ఉంది. దీంతో ఇటీవల ఈ ఆలయాన్ని పునఃప్రారంభించాలని గ్రామస్తులు తీర్మానించి పనులు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం ధ్వజస్తంభం, ఉత్సవమూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగింపుగా గుడి వద్దకు తీసుకొచ్చారు. ఉదయం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో విశ్వక్సేన ఆరాధన, పుణ్యావచనం, రక్షాబంధనం, మృతికాస్వానం, అంకురార్పణ, అరణీమధనం, పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, ధ్వజ కుంభారాధన, శాంతిపాఠం, వేద విన్నపాలు, అగ్నిప్రతిష్ఠాపన, మూలమూర్తి మంత్ర హోమాలు నిర్వహించారు. మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. బుధవారం ఉదయం హోమం, యంత్ర ప్రతిష్ఠాపన, దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, కుంభోద్వాసన, కుంభప్రోక్షణ ప్రథమ దర్శనం, తీర్థప్రసాద వితరణ, అనంతరం శాంతి కల్యాణం మంగళశాసనం నిర్వహించనున్నారు. ఆయా రోజుల్లో అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు కోర్పొలు రాంప్రతాప్‌రెడ్డి, ఎలుక నరేందర్‌రెడ్డి, కేసీడీ భూపాల్‌రెడ్డి, గూడూరు కొండారెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఆగని మట్టి దందా

ఇష్టారాజ్యంగా తవ్వకాలు

- అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఎక్కువ
- గ్రూపులుగా ఏర్పడి రాత్రి వేళల్లో నిర్వహణ
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు


ఉప్పుగడ్డ తండా సమీపంలో తవ్విన మట్టి


పోలీసులు సీజ్ చేసిన వాహనాలతో నిందితులు (ఫైల్)

మహేశ్వరం: మండలంలో అక్రమ మట్టి దందా మూడు పువ్వులు..ఆరు కాయలు అన్న చందంగా సాగుతుంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల్లో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇటుక బట్టీ వ్యాపారులు, ఇళ్ల నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. ఈ తంతు బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, కావలోని బాయి తండా, నాగిరెడ్డిపల్లి, కోళ్లపడకల్, దుబ్బచర్ల, ఆకన్‌పల్లి, కొత్త తండా, తుమ్మలూరు, సిరిగిరిపురం, పలు గ్రామాల్లో అసైన్డ్, చెరువుశిఖం, ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో జేసీబీలు, ఇటాచీలతో తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇది యథేచ్ఛగా సాగుతున్నా ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. టిప్పర్లలో అధిక లోడును నింపి తరలిస్తున్న క్రమంలో గ్రామాలు, తండాల్లో ఇటీవల నిర్మాణం చేసిన బీటీ, సిమెంట్ రోడ్లుపాడవుతున్నాయి.దుమ్ము, ధూళి ఇళ్లపైన పడటంతో రాత్రి వేళల్లో పెద్ద..పెద్ద వాహనాల శబ్దం వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా తరలింపు..

మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, కొత్త తండా, కావలోని బాయి తండాల్లోని ప్రభుత్వ భూమి, నాగిరెడ్డిపల్లి గ్రామంలో టీఎస్ఐఐసీ అధికారులు ఐటీ పార్కు ఏర్పాటు కోసం సేకరించిన ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో మట్టి మాఫియా రాత్రి వేళల్లో చేపట్టి టిప్పర్లలో తరలిస్తున్నారు. కొందరు తమ తమ భూములను టీఎస్ఐఐసీ తీసుకుంటుందని ఎకరానికి నష్టపరిహారం ఇస్తారని దురాశతో మట్టి వ్యాపారులతో పొలాల్లోని మట్టిని జేసీబీలు, టిప్పర్లతో తరలించి విక్రయిస్తున్నారు.

దాడులు చేసినా మారని మాఫియా తీరు..

ఇటీవల ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా తవ్వేసిన వారిని ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు జరిమానా విధించినా మరుసటి రోజు నుంచే మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అధికారులు ఎన్నికల విధుల్లో బీజీగా ఉండడాన్ని అదును చూసుకొని రాత్రి వేళల్లో టిప్పర్లు, జేసీబీల సహాయంతో తవ్వి తరలిస్తున్నారు.

వ్యాపారులుగా పార్టీల నేతలే!

రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నేతలు గ్రూపులుగా జతకట్టి ఒకరికొకరు సహకరించుకుంటూ మట్టి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. రోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకూ మట్టిని జేసీబీ, ఇటాచీలతో తోడేసి టిప్పర్లలో నింపి సొమ్ముచేసుకుంటున్నారు. టిప్పర్‌కు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వెంచర్లు, ఇటుక బట్టీలలో అధిక ధరకు విక్రయించుకుంటున్నారు. కొందరు మండలానికి చెందిన రాజకీయ పార్టీల నాయకులే వెనుకుండి నడిపిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకొని మట్టితవ్వకాలను నిలిపివేయడంతో పాటు మట్టి తరలింపుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం



ఎవరైనా సరే ప్రభుత్వ, అసైన్డ్, శిఖం భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపడితే, రైతు భూమిని పీఓటీ కింద తీసుకొని మట్టిని తరలిస్తే జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఎన్నికల సందర్భంగా తాము విధుల్లో ఉండడాన్ని అదునుగా చేసుకొని తవ్వకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. మట్టి తవ్వకాలకు సంబంధించిన అనుమతులు ఎవరికీ ఇవ్వలేదు. గతంలో ఎస్‌ఓటీ దాడులు నిర్వహించి జేసీబీ, ఇటాచీ, టిప్పర్లను పట్టుకొని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి పెనాల్టీలు వేశాం. పోలీసుల సహకారంతో రాత్రి వేళల్లో గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. మట్టి వ్యాపారాన్ని ప్రోత్సహించినా, తవ్వకాలు చేపట్టినా ఎంతటివారినైనా ఉపేక్షించం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, మహేశ్వరం